# శ్రీవారూ - తాళం చెవీ

అదృష్టంకొద్దీ ఈ దేశంలో పుట్టీ హాయిగా నిక్షేపంగా జీవిస్తున్న వాళ్లల్లో మా ఆఫీసులోని సీనియర్ అసిస్టెంటు శ్రీహరిరావు ఒకడని నా గాఢమైన నమ్మకం! ఇదే ఏ అమెరికాలాంటి దేశంలోనో అయి వుంటే ఇంగ్లీషు సిన్మాలోలా ఒక శుభ సాయంత్రాన ఐదు గంటలవేళ నా చేతిలోని రివాల్వర్ పొగలు కక్కుతూ ఉండగా, దాని తాలూకు గుళ్ళు అతని గుండెకాయని జల్లెడ చేయగా, టైపు చేయగా మిగిలిన కాగితాల్ని తేలిగ్గా టైపు చేసేసి ఆనందతాండవ మాడుతూ ఇంటికెళ్ళి పోయేదాన్ని.

ఇంతకీ నేను ఇలా ఆలోచించడానికి కారణం ఒకటే - ప్రతి రోజూ సాయంత్రం ఐదు గంటలు అవుతూ ఉండగానే ఇక ఆఫీసు నుంచి బయట పడదామన్న ఆత్రంతో టైపు మిషన్ని కట్టేస్తున్న సమయంలో... సరిగ్గా అప్పుడు ఊడిపడతాడు శ్రీహరిరావు. అప్పుడతని చేతిలో బారెడు పొడవున్న రీముడు కాగితాలూ - వాటిల్లో అక్షరాల్లో, అంకెల్తో నిండిన స్టేటుమెంట్లూ...

ఇ.ఇ. (ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు) గారు చెప్పారు మేడం! వీటిని అర్జెంటుగా టైపు చేసి ఇవ్వాలిట!' పదినిమిషాల్లో అంటాడు.

మారు మాట్లాడకుండా టైపు మిషను ముందు కూలబడతాను. అన్నన్ని స్టేటుమెంట్స్ పదినిమిషాల్లో టైపు చేయడానికి ఏ మళయాల మంత్రాలో వస్తే తప్పా వీలుపడదుగా! ఇదీ నాబాధ. అవన్నీ టైపు చేసి ఆఫీసునుంచీ బయట పడేటప్పటికి ఒక్కోసారి పొద్దు మునిగిపోయి, బాగా చీకటి పడిపోయి ఉంటుంది. ఎలాగో కాళ్ళీడ్చుకుంటూ ఇంటి దారిపడతాను.

ఇవాళ కూడా శ్రీహరిరావు పుణ్యమా అని ఆరున్నర అయింది. ఉదయంనుంచీ ఒక్కటేవిధంగా టైపు చేయడం వల్ల తలంతా దిమ్మెక్కి పోయి ఉంది. ఇప్పుడు కప్పుడు కాఫీ కడుపులో పడితేగానీ 'ఆత్మా సీత' (నేను ఫెమినిజాన్ని, ఇష్టపడతాను లెండి, అందుకే ఆత్మారాముడు' అని రాయడం నాకిష్టముండదు) శాంతించదు. ఈ పాటికి నా పతిదేవుడు కాఫీచేసి, ఫ్లాస్కులో పోసీ నా కోసం ఎదురు చూస్తూ ఉంటాడు. ఇకనేం, చక్కగా ఈజీ చైర్లో కాలిమీద కాలేసుకుని కాఫీ తాగడమే అలస్యమనీ నా సిక్స్‌సెన్స్ చెబుతోంది. ఇలా అనుకుంటూ ఉంటే అంగలు గబాగబా పడుతున్నాయి. నాకెప్పుడూ శ్రీశ్రీ పేరడీపద్యం జ్ఞాపకమొస్తూ ఉంటుంది. 'ఎప్పుడు బడితే అప్పుడు కప్పుడు కాఫీనొసంగ గలిగిన సుజనుల్....' ఆహా ఎంత చక్కటి పద్యమో!

తానొకటి తలచిన దైవమొకటి తలచుననీ తెలుసుకోడానికి నాకు ఎంతోసేపు పట్టలేదు. నా పతిదేవుడు ఇంటికి తాళమైనా తీయకుండా డిటెక్టివ్ సిన్మాలో శత్రువుల

దగ్గర చిక్కుకున్న రహస్య పత్రాన్ని ఎట్లా తీసుకు రావడమా అన్న ఆలోచనలతో సతమతమైపోతున్న హీరోలా, సీరియస్సుగా మొహం పెట్టుకునీ, మరీ సీరియస్సుగా కనుబొమ్మల్నీ ముడిచీ, భూమిని కొలుస్తున్నట్టు పెద్ద పెద్ద అంగలు వేస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాడు - ఖాళ్ళుకాలిన పులిలా! (క్షమించాలి, పతిదేవుణ్ణి సామెతకోసం పిల్లి చేయడం నాకు ఇష్టం ఉండదు. కాళ్ళంటూ కాలేక పిల్లి అయినా పులయినా ఒక్కటేనని నా నిశ్చితాభిప్రాయం! కాదనువారు జంతుశాస్త్ర పరశోధకుల్ని సంప్రదించ గలరు)

'ఏమండీ.. ఏమిటిలా... తలుపూ..." అర్థోక్తిగా – మా కాళ్ళు కాలిన పులిని సమీపిస్తున్నట్టే అడిగాను.

శాంపిల్‌గా చిర్నవ్వు నవ్వీ.....'నవ్వు' ప్రక్రియ అయిపోగానే పెదాల్ని యధాస్థితికి తెచ్చుకునీ, కనుబొమల్ని మాత్రం మునుపటిలాగా సీరియస్ ఉట్టిపడేలా ముడిచేసీ- "నా తాళం చెవి పోయింది కృష్ణప్రియా!" అంది 'పులి' విషాద వార్తలు చదివేటప్పుడు మొహాన్ని ఏడుపుగొట్టుగా పెట్టుకోవాలన్న నియమాన్ని పాటించిన తెలుగు టీవీ న్యూస్ రీడర్‌లా మొహం మాడ్చుకుని.

"పోయిందా! సర్లేండి... ఇంతకు మునుపులా అవస్థలు తప్పవన్నమాట...ఏం చేద్దాం!" అంటూనే నా వ్యానిటీ బ్యాగ్‌లోంచి తాళం చెవీ తీసి, ఇంట్లోకి వెళ్ళి అన్ని గదుల్లోనూ దీపాలు వెలిగించేసి, బట్టలు మార్చుకుని వచ్చాను. కాళ్ళు కాలిన పులి ఇంకా బయట తిరుగుతూనే ఉంది. ఇదేమిటీ, పులీ! తన తాళం చెవితో తలుపు తీస్తే తప్ప లోపలికి రాకూడదని శపథమేమయినా చేసిందా? ఆ మాటే 'పులి' తో అన్నాను.

"ఛ- అదేం లేదు ప్రియా! మరీ తాళం చెవీ..ఎక్కడ పడి...' అంది పులి - పిల్లిలా 'మ్యావ్ మ్యావ్' అన్నట్టు గొణిగేస్తూ.

సగంలో నిలిపివేసిన పులి వాక్యాన్ని పూరిస్తూ ...పోయిందో ఏమో...ఇంకా ఆలోచనలకు వాయిదా పెట్టండి. పతిదేవా! గదిలోకి పోయి తమరి వస్త్రాలను మార్చుకొనుడు. నేను ముఖ ప్రక్షాళనం గావించుకుని వంటకంబు చేయుటకు ఉపక్రమించెదను!!! "అంటూ తప్పుల తడక గ్రాంధీకంతో పులిని అదరగొట్టేశాను. అసలు 'పులి' ఉద్యోగమే 'తెలుగు పండి'టాయె! అనంతపురం క్లాక్‌టవర్ దగ్గర నిష్కారణంగా ఒక ఆగంతకుడు మా 'పులి' చొక్కా పట్టుకుని నిలేసిన వాడినయనా క్షమిస్తాడు కానీ, తెలుగు గ్రాంధీకాన్ని సరిగా మాట్లాడలేకపోతేమాత్రం అసలు క్షమించడు. నేను ప్రాణసఖిని కాబట్టి బతికిపోయేను. పులిమందలింపుగా.... చాల్లేద్దూ. గ్రాంధీకాన్ని ఎందుకు ఖూనీ చేస్తావు" అంటూ మృదుమందహాసం చేస్తూ లోపలికి వచ్చేసింది.

★ ★ ★

నేను మొహం కడుక్కు రావడానికని బాత్‌రూంలోకి వెళ్ళి వచ్చేటప్పటికి వారు బయటి గదిలో కనిపించలేదు. 'ఎక్కడికి వెళ్లారా? బట్టలు మార్చుకోకుండా', అని వెదుకుతూ ఉండగా, వంట గదిలో కాఫీ చేస్తూ కనిపించారు. నా పతి దేవుడికంటే

ఉత్తమ పురుషుడు ఈ భూ ప్రపంచం మీద ఏ పెళ్లానికయినా మొగుడిగా లభించి ఉంటాడా అనిపించి, ఆ క్షణంలో కొండంత సంతోషం, కించిత్తు గర్వం నా మెదడులో ప్రవేశించగా, ఆయన్ని వెనుక మాటుగా అమాంతం కౌగలించేసుకుని సుతిమెత్తగా ఎడమ చెవిని కొరికేను.

సదరు హఠాత్ పరిణామానికి పతిదేవుడు పరవశం చెందకుండా ఓరచూపు చూస్తూ దీనంగా మొహంపెట్టి – "నా తాళంచెవి ప్రియా ఎక్కడో పడిపోయిందే!" అన్నాడు. ఆ మధుర క్షణంలో మురిపెంతో ముంచెత్తాల్సిన మొగుడు అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డులా 'తాళంచెవో' అంటూ ఉంటే ఏ పెళ్ళానికయినా అరికాలినుంచీ నడినెత్తి వరకూ మండకుండా ఉండగలదా! అందుకే నాకూ మండింది! రాగానికీ, అనురాగానికీ తేడా తెలీని మొద్దుని నాలుగేళ్ళ క్రితం కట్టుకున్నందుకు నన్ను ఏ దేవుడు రక్షిస్తాడా అని అరక్షణం దిగులుపడీ –

"హబ్బా! పోతే పోయిందిలే.... అరే! ఎంత మొద్దబ్బాయివి నువ్వా! ముద్దుల పెళ్ళాం మొగుడిమీద ప్రేమ పొంగి అనురాగంతో హత్తుకుంటే గొప్ప అనుభూతినీ, అనుభవాన్నీ పంచుకోవడం పోయి, ఆ దరిద్రపు తాళంచెవి పోయింది మొర్రో అని పాత రికార్డు వేస్తావా? నీకంటే అందగాడూ, నీ కంటే మందమతీ యావత్ ప్రపంచంలో ఎవడూ ఉండడండోయ్!" అంటూ ఆవేశంతో తిట్టేశాను.

మెరుపూ, ఉరుమూ లేకుండా పడిన పిడుక్కు ఝుడుసుకున్నాడులా ఉంది. అయోమయంగా ఓ వెర్రి చూపు చూసీ చార్లీ చాప్లిన్ నవ్వుని పెదాలపై బిగించేడు. అర్జెంటుగా మావారి గుండెల్లో బాకు దించాలని వచ్చిన ఏ రాక్షస శత్రువు అయినా ఆ నవ్వుని చూసేక పదిమీటర్ల దూరానికి బాకును విసిరేసి మావార్ని గుండెకు హత్తుకోవాల్సిందే! సరిగ్గా ఆ పనే చేసేన్నేను. అయితే నా గుండె తడి ఇంకా ఆరనన్నా లేదు. "కృష్ణప్రియా! స్టౌ మీద పాలు ఇగిరిపోతున్నాయి. మరి కాఫీకి ఇబ్బంది అవుతుంది!" అంటూనే కౌగిట్లోంచి విదిలించుకొని తొలిగేడు. "హూఁ పాలా? ఏం పాలూ? దరిద్రం పాలూ! ఇగిరి పోతేనేం! పాలపొడితో కాఫీ తాక్కూడదా? మళ్ళీ ఇట్లాంటి మధుర క్షణాలూ.." అంటూ దులిపేయాలనిపించింది. అయితే, ఆయన చార్లీచాప్లీన్ నవ్వు నవ్వుతాడని జ్ఞాపకానికి వచ్చి తలపట్టుకుని పక్కనే ఉన్న స్టూలుపై కూచున్నాను. ఆయన నెమ్మదిగా కాచిన పాలను దించి స్ట్రాంగు కాఫీ చేశాడు. అందాకా కొరకొర చూస్తున్న నా చూపుల్ని ఏమాత్రం గమనించకుండా కాఫీ కప్పుని నా చేతికి అందించి, పక్కనే ఉన్న బియ్యం మూటపై కూచున్నాడు. కాఫీ తాగుతూ పుల్కా పుల్కా చూస్తున్నాడు – గాల్లోకి.

"తాళంచెవిని గురించేనా మహానుభావా!" ఆలోచిస్తోంది – పోయిందేమో పోయింది. ఇంతకు మునుపూ ఇలాగే రెండు నెలలు ఇబ్బంది పడ్డాం. అందుకే ఇప్పుడే బజారుకు పోయి డూప్లికేట్ కీ చేయించుకు రండీ!" అన్నాను.

"ఇప్పుడెవరుంటారు ప్రియా! నేను బజార్లోకి వెళ్ళేటప్పటికి తాళాలు రిపేరీ వాడు కొట్టు మూసేసి పోయి ఉంటాడు – రేపు చూద్దాంలే" అన్నాడు నిబ్బరంగా.

ఆయన అంత నిబ్బరంగా 'రేపు చూద్దాంలే' అన్నాడంటే మళ్ళీ రెండు నెలలు ఇద్దరం ఒంటితాళం చెవితో అవస్థ పడాల్సిందే నన్న మాట! కానున్నది కాకమానదు. ఆయన ఎంత సాధుస్వభావో అంత బద్ధకస్తుడు మరి!

తులసికోటను గురించీ చెప్పేముందు మా ఇంటిని వర్ణించాల్సిందే వాస్తు శాస్త్రజ్ఞుడెవడైనా మా ఇంటికి ఎప్పుడూ రాలేదు కానీ, వచ్చుంటే మటుకు తప్పకుండా ఎడాపెడా గుండెలు బాదుకునేవాడు – వాస్తు శాస్త్ర ప్రకారం ఇల్లుకట్టలేదని కాదు, అలా కట్టేందుకు ఏ మాత్రం వీలులేదేమా! అని. మామూలు సగటు ఇంటికి ఉండాల్సిన లక్షణాలేవీ మా ఇంటికి లేవు. పెరడు లేదు. కాంపౌండు అసలు లేదు. వెంటిలేటర్లు లేవు. పెద్ద పెద్ద కిటికీలు లేవు. చలికాలం తప్పా తక్కిన కాలాల్లో మనుషుల మాట అటు ఉంచి దోమలు కూడా ఉండలేవు ఇంట్లో. కొంత ఇరుగ్గా ఉన్న రోడ్డుకు అటూ ఇటూ వరసగా ఉంటున్న అంటు మిద్దెల్లో మా ఇల్లూ ఒకటి. దానికి పెరడు లేకపోయనా, కాంపౌండు లేకపోయినా మా ఇల్లు గలవాళ్ళు తులసి కోట ఉండటం చాలా అవసరం అని భావించినట్టుంది, అందుకే దాన్ని వరండాలోని గోడకి బయటి వైపు ఆరడుగుల ఎత్తులో ఒకబండపై అమర్చారు. ఆ తులసికోటే ప్రస్తుతం మా పాలిట అదృష్టం అన్నమాట. ఆర్నెల్ల క్రితం ఇప్పటిలాగే మావారు తాళం చెవిని ఎక్కడో పారేసుకొస్తే జమ్మిచెట్టుమీద పాండవులు అస్త్రాలు ఉంచినట్టు ఉన్న ఒకే తాళం చెవినీ, మా ఇద్దరికీ అందుబాటులో ఉండేలా తులసి కోటలో భద్రపరిచేవాళ్ళం.

ఇప్పుడు మళ్ళీ తులసి కోటే గతి!

ఉదయం తొమ్మిది గంటలవుతోంది. నేను ఆయనకు క్యారియర్ కడుతున్నాను. ఆయన స్కూలు కెళ్ళేందుకు తయారు అవుతున్నాడు.

"ప్రియా! నువ్వు తాళం చెవిని ముందులాగే తులసికోటలో పెట్టేసి పోవే! సాయంత్రం నేను త్వరగా వచ్చి, డూప్లికేటు కీ చేయించుకు వస్తాను" బయటి గదిలోంచి నాకు వినబడాలని గట్టిగానే చెబుతున్నాడు.

ఏమిటీ మనిషీ! గొబ్బెమ్మల్ని ముగ్గులో పెట్టెయ్యవే అన్నంత సామాన్యంగా చెబుతున్నాడు! ఈ మనిషికి గుట్టు ఏదో, రట్టు ఏదో కూడా తెలీదు. మనం తాళంచెవి ఎక్కడ ఉంచుతున్నది వీధంతా తెలిసిపోవాలా? అని కోపం వచ్చింది నాకు. పిలిచి తిడదామనిపించింది. తిట్టానంటే ఇక అంతే – చార్లీ చాప్లిన్' నవ్వు. ఆయన నవ్వడం, నా గుండె కరిగిపోవడం. ఇవన్నీ విధి నిర్వహణకు వెళ్ళేటప్పుడు అంత మంచిది కాదని మానుకున్నాను. క్యారియర్ని తీసుకుని బయటిగదిలోకి వస్తూ నా కోపాన్ని మందహాసంలోకి అనువదించి చూశాను ఆయనవేపు.

"ఏం ప్రియా?" అన్నాడు పాతాళభైరవి సినిమాలోని ఎన్.టి.ఆర్.లా చిర్నవ్వు నవ్వుతూ –

"అబ్బే – ఏం లేదు ప్రియతమా! ఇందాకా తాళం చెవిని నేను ఎక్కడ పెట్టాలా అన్న విషయం అంత గట్టిగా చెప్పారూ, అది...మనిద్దరికీ సంబంధించినదా లేకుంటే ఊరందరికీ సంబంధించిందనుకుంటున్నారా?"

"సారీ ప్రియా!" అంటూ క్యారియర్ అందుకున్నాడు. మొదటిప్రయత్నంలోనే ఆయనకు అర్థమయ్యేలా చెప్పగలిగిన ఆనందంతో - "దెరీజ్ నో లారీ టు క్యారీ యువర్ సారీ టు బళ్ళారి!" అన్నాను.

"కృష్ణ ప్రియా! నాదో చిన్న రిక్వెస్టు నేను 'సారీ' చెప్పినప్పుడల్లా ఆ ఆంగ్ల వాక్యాన్ని వాడేసి సెంచరీలు కొట్టిస్తున్నావు కొత్తదేమైనా వాడవోయ్!" అంటూ సీరియస్‌గా మొహం పెట్టి అర్థిస్తున్నట్టు అభినయిస్తుంటే ఫక్కున నవ్వేసేను. 'అమ్మో ఈ మనిషిలో సెన్సాఫ్ హ్యూమర్ కూడా ఉందండోయ్!' అనిపించింది.

ఆయనేమో స్కూలుకు వెళ్ళిపోయినాడు. గంట పదీ పదిహేను అవుతూ ఉంది. ఇంక నేను ఆఫీసుకు బయల్దేరాల్సి ఉంది. అలా ఓ సారి వీధిలోకి దృష్టి సారించాను. అక్కడక్కడా కొంతమంది ఆడవాళ్ళూ, పిల్లలూ, ముసలివాళ్ళూ, కనిపించారు. కొందరు మాట్లాడుతూ, కొందరు ఏవో ఇంటి పనులు చేసుకుంటూ ఉన్నారు.

ఇక నేను చేయాల్సినదల్లా ఇంటికి తాళం వేసి అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న పాత ప్లాస్టిక్ చెంబులోని నీళ్ళని సగం తులసికోటలోకి పోయడం, పాదిలో నీళ్ళు ఎంతవరకూ ఉన్నాయో తడిమే నెపంతో తులసికోటలోకి తాళం చెవిని జారవిడువడం! తులసికోటలోకి నీళ్ళు పోయడం ఎంత ముఖ్యమో దాన్ని మొక్కుకోవడం అంతే ముఖ్యం కాబట్టి గొప్ప భక్తి ప్రదర్శిస్తూ ఒకటిన్నర నిమిషం మొక్కుకోవడం. బయట చూసేవాళ్ళు మనల్ని పసిగట్టకుండా నన్నమాట ఒకటిన్నర నిమిషం మొక్కూ - తాళం చెవి తీసుకోవాల్సి వచ్చినపుడు ప్లాస్టిక్ చెంబులో మిగిలివున్న నీళ్ళనిపోస్తూ. నీటిమట్టం చూస్తూ తాళం చెవిని తీసేసుకోవడం. అయితే మొక్కును మరవకూడదు.

ఏమైతేనేం తాళం చెవిని దిగ్విజయంగా తులసికోటలోకి జారవిడిచి ఏ మెరుగని దానికి మల్లే ఆఫీసుకి బయల్దేరాను.

★ ★ ★

గొప్ప 'బద్ధకిస్టు' గా మరోసారి రుజువు చేసుకోడానికేమో ఆయన డూప్లికేటు తాళం చేయించనేలేదు. రేపూ, మాపూ అంటూ వాయిదాలు పెడుతూనే వున్నాడు. ఏమన్నా అన్నానా? చాప్లిన్ నవ్వొకటి ఉందిగా.. నా గుండె కరిగి నీరవుతుంది. ఏం చేద్దాం?

ఓరోజు మధ్యాహ్నం ఆఫీసులో టైపు చేసుకుంటూ ఉండగా నాకు టెలిగ్రాం వచ్చింది. ధర్మవరంనించీ అన్నయ్య ఇచ్చిన టెలిగ్రాం అది. అందులో 'నువ్వూ బావా వెంటనే బయల్దేరి వచ్చేయండి ఇక్కడికి. చెల్లాయికి పెళ్ళిచూపులు. హిందూపురం వారు వస్తున్నారు. ఈ సాయంత్రమే" అని ఉంది. నేను ఆ పూటకి సెలవు పెట్టేసి మావారి కోసం స్కూలుకు వెళ్ళాను. ఆయనకు విషయం చెప్పాను. "నువ్వెళ్ళు ప్రియా! నేను సాయంత్రంకల్లా ధర్మవరం చేరుకుంటాను" అని హామీ ఇచ్చేడు. నేనేమో ఆత్రంగా ధర్మవరం చేరుకున్నాను. పెళ్ళి చూపుల సమయానికి ఆయనా వచ్చేశేడు. "తాళంచెవీ అక్కడే ఉందా? ఇంటికెళ్ళి తాళం చెవి తేకూడదా?" అన్నాను. "స్కూలు నించీ ఇలాగే వచ్చేశేను" అన్నాడు. ఊరు విడిచి వచ్చాక తాళం చెవి దగ్గరలేకపోవడం నాకెలాగో ఉంది.

"తులశమ్మ తల్లీ! ఇంటికేమీ ప్రమాదం కలక్కుండా కాపాడు తల్లీ! అంటూ మనసులోనే మొక్కుకున్నాను. అయినా మనసు నెమ్మది కాలేదు. మా ఇంటి చుట్టు పక్కల వాళ్ళు అంతమంచివాళ్ళు కాదని ఎందుకో అనిపిస్తోంది. మేం ఇంట్లో లేనిది చూసి ఇంటిని దోచుకుపోతారేమో! ఏమో చెప్పలేం. నా అనుమానానికి సరయిన కారణం ఏదీ లేదని తెలుసు. తాళం చెవి దగ్గర లేకపోయినందువల్లనే నాకట్లా అనిపిస్తోందా? ఏమో! రాత్రి పడుకోబోయే ముందు ఆయనతో ఈ మాటే అన్నాను. "ఛ! ఊరికే ఇరుగూ పొరుగూ వాళ్ళని అనుమానించకు. మన ఇంట్లో ఏమున్నాయి విలువ వస్తువులూ? ఏదో టీవీ, టూ ఇన్ వన్ , టేప్‌రికార్డర్, బీరువాలో రవ్వలనెక్లెసూ, వాషింగ్ మిషనూ...ఇంతే కదా?" అన్నాడు ఆవులిస్తూ. అంటే ఇవి చాలవా దొంగతనం చేయడానికి. బంగారు బిస్కట్లూ వజ్రాల ఆభరణాలు ఉండాలి" అని దులిపేద్దా మనుకుని, మానుకున్నా. ఎంచేతంటే ఆయన చాప్లిన్ నవ్వు నవ్వుట, నా గుండె కరగుట వగైరా వగైరా గుర్తొచ్చిందన్నమాట!

ఆ మరుసటి రోజు ఉదయం ఇంట్లో అందరూ ఉండమన్నా వినకుండా ఇద్దరం అనంతపురానికి బయల్దేరాం. ఏడు గంటలు అవుతున్నట్టే ఊరు చేరుకున్నాం. కూరగాయలు తెచ్చేందుకు మా వారు బస్టాండునుంచి లాగే మార్కెట్‌కు వెళ్ళారు. నేను ఒంటరిగా ఇంటిదారిపట్టాను.

మా ఇంటిని సమీపిస్తుండగా అల్లంత దూరంలో నుంచే మా ఇంటి తలుపులు బార్లా తీసి ఉన్నట్టు కనిపించింది. నా గుండెలు గుభేల్మన్నాయి. ఇంకేముంది దొంగలు పడ్డారు. నగలూ, బట్టలూ, పాత్రలూ, టీవీ, టేప్‌రికార్డరూ ఒక్కటీ వుండవు. మొహం చెమట్లు పట్టేసింది. నా కాళ్ళలో వణుకువచ్చి చచ్చుపడిపోయినట్టు నడిచేందుకు వీలుపడడం లేదు. అడుగులు తడబడుతూ ఉన్నాయి. చుట్టుపక్కల వాళ్ళు నావైపు చూస్తూ ఉన్నా, వాళ్లని అడగడానికి నోరు పెగలడం లేదు. గబా గబా గడపదాటాను.

వాకిటికి ఎదురుగా ఈజీ ఛెయిర్లో పేపరు చదువుతూ మా మరిది ఆనందరావు కనిపించాడు. నన్ను చూడగానే దిగ్గున ఆశ్చర్యంగా నవ్వుతూ ఈజీ ఛైర్లోంచి లేస్తూ "అన్నయ్యేడి వదినా?' అంటూ కుశల ప్రశ్నలు వేస్తున్నాడు. నేను ఒక్క ప్రశ్నకు కూడా సమాధానమివ్వడం లేదు. నాకళ్లని నేను నమ్మలేకపోతున్నాను. ఢిల్లీ నుంచి ఎప్పుడు వచ్చాడు ఆనందరావు? ఇప్పుడు ఇంట్లోకెలా వచ్చాడు? అని ఆలోచిస్తూ ఉన్నాను.

"నువ్వు వచ్చేటప్పటికి తలుపు బార్లా తెరిచి ఉందాయ్యా?" అడిగేను ఆనందరావుని.

"ఎందుకొదినా! అలా అడుగుతున్నావు? నేనే తీశాను తలుపుల్ని"

"మరి తాళం చెవీ?"

"తులసి కోటలో వదినా!"

"ఆc....అది అక్కడ ఉన్నదని నీకెలా తెలుసు?"

"ఎలాగంటే ఏం లేదు వదినా! నిజానికి నాకేం తెలీదు. తెల్లవారే ఇక్కడికి వచ్చాను. మీరిద్దరూ ఎక్కడికి వెళ్ళారో ఈ చుట్టుపక్కల వాళ్ళెవరూ చెప్పలేకపోయారు.

ఏ లాడ్జింగుకయినా వెళ్దామా అని ఆలోచిస్తూ ఉండగా.... 'ఇంట్లోకి వెళ్తారా?' అని అడిగారు ఇరుగుపొరుగు వాళ్లు."

"ఎవరూ?"

"ఒకరేమిటి, ఎదురింటాళ్ళూ, పక్కింటాళ్లూ... సరేనన్నాను. 'ఆ తులసికోటలో తాళం చెవి ఉంటుంది. మొక్కి మరీ తీసుకోండి' అన్నారు. నేను అలాగే తీసుకున్నాను. అయినా చుట్టుపక్కల అందరికీ తెలిసేట్లు పెట్టడం ఏం పద్ధతి వదినా?" అని అడుగుతున్నాడు మా మరిది.

మా చుట్టుపక్కల వాళ్లని దొంగలుగా అనుమానించినందుకు సిగ్గుపడ్డాను. రోజూ వాళ్ళు చూస్తూ ఉండగా తులశమ్మకు ఆపద్ధర్మ పూజలు చేస్తుండటం కళ్ళముందు మెదులుతుంటే అవాక్కయిపోయాను.

(ఆదివారం ఆంధ్రప్రభ - 4 ఫిబ్రవరి, 1996)